క్లుప్తంగా

నేడు మండల సమావేశం

వల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వ్యవసాయం, ఉద్యాన వనశాఖ, మహిళా సాధికారత, వైద్య ఆరోగ్యశాఖ, అంటు వ్యాధులు, తాగు నీరు, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం మొదలైన అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంభందించి పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

రేపు టెంకాయల వేలంపాట

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలోని అంకాలమ్మతల్లి దేవాలయానికి సంబంధించి బుధవారం టెంకాయల వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ రూ.50వేల డిపాజిట్ చేస్తే వేలంపాటలో పాల్గొనడానికి అర్హత ఉంటుందని, ఈ విషయాన్ని వేలంపాటదారులు గమనించాలని సూచించారు. వేలం పాటలో హక్కు దక్కించుకున్న వారు ఏడాదిపాటు ఆలయంలో టెంకాయలు విక్రయించుకోవచ్చని తెలిపారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి



సర్వేలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : మండలంలో జరుగుతున్న పీ ఫోర్ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వేలన్నీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ శ్రీనివాసరెడ్డి, అన్ని సచివాలయ పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.


విద్యార్థినికి సత్కారం



హరిణిని సత్కరిస్తున్న రారా సాహితీ సమితి, పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం రారా సాహితీ సమితి తరపున పెన్షన్ల సంఘం ఆధ్వర్యంలో లయోలా పాల్‌టెక్నిక్ కళాశాలలో సీఈఈ మూడవ సంవత్సరం చదువుతున్న హరిణిని సత్కరించారు. హరిణి ఇటీవల రాష్ట్రస్థాయి పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించగా.. పెన్షనర్ల సంస్థ తరపున హరిణికి షీల్డ్‌తోపాటు పుస్తకాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రారా సాహిత్య సమితి సభ్యులు కొండారెడ్డి, మరకా సూర్యనారాయణరెడ్డి, రాజేశ్వరరెడ్డి, కొండారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈకేవైసీ



సోషల్ ఆడిట్‌పై సమీక్షిస్తున్న తహసీల్దార్

సింహాద్రిపురం : ఈకేవైసీ ప్రక్రియ ఈ నెల 3వ తేదీ నాటికి ముగిసిందని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఈ–క్రాప్ రబీ 2025 సోషల్ ఆడిట్ మొదలవుతుండటంతో అన్ని గ్రామాల వీఆర్‌ఓలతో తహసీల్దార్ అధ్యక్షతన సమీక్ష జరిగిందన్నారు. ఏఓ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కే సిబ్బంది రైతుల విశిష్ట సంఖ్యను పరిశీలించి రైతుల పేర్లు అన్ని ఉండేటట్లు చూడాలని వీఆర్‌ఓలకు సూచించారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్లను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె. ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు పాల్గొన్నారు.

బాల్య వివాహం.. భవితకు శాపం

మూడు ముళ్లు, ఏడు అడుగులతో రెండు మనసుల మధ్య బంధం ఏర్పడి కుటుంబ వ్యవస్థ మరింత పటిష్టం అవుతుంది. బాల్య వివాహాలు దీనికి మచ్చ తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికీ ఇవి కొనసాగుతుండడం గమనార్హం. తెలిసీ తెలియని వయసులో వివాహాలు చేస్తుండటంతో వారి జీవితాలు అంధకారంలో మునిగిపోతున్నాయి. బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం అవుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా.. అనుకున్న స్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు బాల్య వివాహాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- గ్రామాల్లో అవగాహన సదస్సులు
- జిల్లావ్యాప్తంగా ప్రజాచైతన్య కార్యక్రమాలు
- ఉత్సాహంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు

పులివెందుల రూరల్ : బాల్య వివాహం.. భవితకు శాపమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని భాకరాపురం సచివాలయ పరిధిలో బాల్య వివాహాలను అరికట్టాలి అనే అంశంపై సచివాలయ, అంగన్‌వాడీల సిబ్బందితో కలిసి ఆమె కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. అనంతరం వారు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఫాస్టర్లు ఎజ్రా, సంతోష్, ముస్లిం మత పెద్ద అజ్మతుల్లా, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు



సింహాద్రిపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారి, అంగన్‌వాడీ సిబ్బంది

బాల్య వివాహంపై అవగాహన

సింహాద్రిపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మండల కేంద్రం సింహాద్రిపురంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చేస్తే వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మండల కేంద్రమైన సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జెండర్ ఈక్వాలిటీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ పర్యవేక్షించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

తొండూరు : మండలంలోని మల్లేల అంగన్‌వాడీ–3 కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ సుధాకర్ బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించి ఆడ పిల్లను పుట్టనిద్దాం, ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఆడపిల్లను చదివించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

చింతకొమ్మదిన్నె : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో ఎంపీడీఓ కుళ్లాయి బాబు ఆధ్వర్యంలో బాల్యవివాహాలను నిర్మూలించాలనే లక్ష్యంతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ, తహసిల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని తెలిపారు. చిన్నప్పుడే వివాహం చేయడం వల్ల చదువు ఆగిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మత పెద్దలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

వేంపల్లె : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు బిడ్డాల మిట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహం చేస్తే కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తారని, బాల్య వివాహాలు చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ అధికారులు సమాచారమివ్వాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠేశ్వరరెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహంతో అనర్థాలు

ఎర్రగుంట్ల : బాల్య వివాహాలు వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, అందుకే బాల్య వివాహాలు నిరోధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్‌బేగం అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. వాటిపై అందరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



తొండూరు : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



చింతకొమ్మదిన్నెలో..



వేంపల్లెలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది



ఎర్రగుంట్లలో..

ఆకుకూరలతో ఆరోగ్యం



రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు అరుణ

పులివెందుల టౌన్ : ప్రతిరోజు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించుకోవచ్చని అధ్యాపకురాలు అరుణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో కౌమర బాలికల రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ రక్తహీనత నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. బాలికల్లో ఐరన్, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండటం వల్ల కళ్లు తిరిగిపడిపోవడం, అలసట రావడం తదితర ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పాఠశాల హెడ్మాస్టర్ మార్తమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ కష్టాలు



పాతబస్టాండు ఆవరణలో రోడ్డుకు అడ్డంగా భారీ వాహనం

ముద్దనూరు: ముద్దనూరులో ట్రాఫిక్ కష్టాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. బైపాస్ రహదారి ఉన్నప్పటికీ తరచూ భారీ వాహనాలు ముద్దనూరు పాత బస్టాండు ఆవరణ, సర్కిల్ నుంచి ప్రయాణిస్తుండడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. దీంతోపాటు మండలకేంద్రంలో ఇతర వాహనాలు కూడా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో పాదచారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. పోలీసులు స్పందించి భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా కట్టడి చేయాలని,ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

శనగలకు మద్దతు ధర ప్రకటించాలి

ఎర్రగుంట్ల : పప్పుశనగకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి కోరారు. సోమవారం రైతులతో కలసి తాహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటచేతికి వచ్చే సరికి దళారులు క్వింటా రూ.5,000 నుంచి రూ.5,500 కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సబ్సిడి పప్పు శనగ విత్తనాలు క్వింటా రూ.7,200 ప్రభుత్వం అందించిందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు తాహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఇల్లూరు కృష్ణారెడ్డి, సీపీఐ నియోజకవర్గ సమితి కార్యాదర్శి నారాయణ, రైతులు పాల్గొన్నారు.



తాహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

మద్దతు ధర ప్రకటించాలి

పెండ్లిమర్రి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు, పండించిన పంటలను మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం పెండ్లిమర్రిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం క్రింద ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు. అలాగే భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ అమలు చేయాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ నరసింహులుకు అందజేశారు. కార్మిక సంఘం మండల నాయకుడు చెన్నయ్య, అయ్యవారయ్య, మల్లేష్, గంగాధర్, ఉత్తయ్య పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

పులివెందుల టౌన్ : దేశాభివృద్ధిలో శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని రెవరెండ్ ఫాదర్ విజయ్, రెవరెండ్ ఫాదర్ వనచిన్నప్ప అన్నారు. పట్టణంలోని స్థానిక సెయింటాన్ పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకుండా మనం జీవితాన్ని ఊహించలేమన్నారు. ఈ ప్రపంచాన్ని శాసిస్తూ, నడిపించే శక్తిగా సైన్స్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం జరుపుకోవడం ద్వారా ప్రజలకు సైన్స్ ప్రాముఖ్యత, సాంకేతిక వినియోగం, దాని ఉపయోగాల గురించి అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు నమూనాలను పరిశీలించారు. ఫాదర్ సైలేంద్ర, రెవరెండ్ ఫాదర్ సిస్టర్, సుశీల, పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ దయాకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు మంగళం!

- రైతు నేస్తాలుగా నాడు ఎంతో సేవలు
- రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ
- తాజాగా రైతు సేవా కేంద్రాలుగా మార్పు

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు నేస్తాలుగా పనిచేశాయి. విత్తనాల మొదలుకొని విక్రయాల వరకు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. అన్నదాతలు పండించిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా గిట్టుబాటు ధరలకు ఆర్‌బీకేల నుంచి విక్రయించుకునే అవకాశం కల్పించేవారు. ఎరువులు, పురుగు మందులతోపాటు వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి అర్హులను ఎంపిక చేసి వ్యవసాయ యంత్రాలను అందజేసేవారు. ప్రతి అంశాన్ని ఆర్‌బీకేల పర్యవేక్షణలో వ్యవసాయాధికారులు నిర్వహించేవారు.



రైతు భరోసా కేంద్రంలో ఎరువులను అందుకుంటున్న రైతు (ఫైల్)

నాడు ఖుషీ ఖుషీగా

ఉన్న ఊళ్లోనే ఆర్‌బీకేల ద్వారా రైతులు సేవలు పొందేవారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికి ఉచిత పంటల బీమా వర్తించేది, పంటలు నష్టానికి గురైన సమయంలో ఎన్యూమరేషన్ నిర్వహించి వీలైనంత త్వరగా అంటే నెల్లోనే రైతులకు పరిహారాన్ని అందజేయడంలో వీటి పాత్ర కీలకంగా ఉండేది. వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వీటి పనితీరును పరిశీలించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన పశుసంవర్ధక, సూక్ష్మసేద్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల్లో రాయితీలను పొందాలనుకునే రైతులు ఆర్‌బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉండేది. రైతులు పండించే ధాన్యం దళారుల పాలుకాకుండా ఆర్‌బీకేల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారి నుంచి దాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను అందజేసే పరిస్థితి ఉండేది.

నేడు దయనీయం

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఆర్‌బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. సేవలను అంతంత మా త్రంగానే అందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటల బీమా పథకం, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలు అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు యత్నిస్తోందని సమాచారం.

సేవలను పెంపొందించాలి

రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలను పెంపొందించాలి. పొలం బడిని నిర్వహించేందుకే సేవా కేంద్రాలను వినియోగిస్తున్నట్లు ఉంది. రైతు సేవా కేంద్రాల సంఖ్యను తగ్గించే యోచనలో ప్రభుత్వం ఉందనే ప్రచారం ఉంది. రైతులకు సంబంధించి సేవలను పెంచితే మంచిది.

– మల్లారెడ్డి రైతు, సింహాద్రిపురం

పంటల బీమా ఏదీ?

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంటల బీమా గతంతో కల్పించారు. ఇప్పుడు రైతులే నేరుగా పంటల బీమా నగదును ఆన్‌లైన్‌లో చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. వీటి సంఖ్యను తగ్గిస్తే రైతులు ఇబ్బందులు పడతారు. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాజశేఖరరెడ్డి, రైతు, సింహాద్రిపురం

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (వైఎస్‌వీఆర్‌ఎం), ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీసాయిచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఇంటర్ రెండవ సంవత్సర తెలుగు, సంస్కృతం పరీక్షలతో మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీసాయిచైతన్య కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 812 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్



వేముల : దివ్యాగులు కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం పొందవచ్చని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్ అన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులకు జైపూర్ కృత్రిమ అవయవాలను ఉచితంగా అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు రమా దంపతులు ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ది చేంజ్ మేకర్స్ స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో ఈనెల 7, 8, 9 తేదీల్లో విజయవాడ వన్ టౌన్ సి వి రెడ్డి హాలులో ఏర్పాటు చేసే ఈ క్యాంపులో ప్రమాదవశాత్తు అవయవాలు కోల్పోయిన 400 మంది దివ్యాంగులకు జైపూర్ కృత్రిమ కాళ్లు, చేతులు పూర్తి ఉచితంగా అమరుస్తారని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు వారి వైకల్య ధ్రువీకరణ పత్రం పేరు, ఊరు, వివరాలు వాట్సప్ చేసి ఎన్‌రోల్ చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు తమ వివరాలను 9440727042 అనే ఫోన్ నంబర్‌కు వాట్సప్ చేయాలని కోరారు.

ఈ దారి.. పూలదారి





బోగన్ విలియాను తెలుగులో కాగితం పూలు అంటారు. ఇవి చాలా తేలిగ్గా ఉండి, ఎక్కువరోజులు వాడిపోకుండా, తాజాగా ఉంటాయి. వీటిలో వందల వర్ణాల పూలు మనకు లభ్యమవుతున్నాయి. వాటి అందాన్ని మాటల్లో వర్ణించలేం, చూసి తీరాల్సిందే. పార్కుల్లోనూ, గ్రామాల్లోనూ, పెద్ద పెద్ద భవంతుల ముందు, డివైడర్స్ మధ్య కాగితం పూల మొక్కలను ఎక్కువగా పెంచుతుంటారు. వీటికి పెద్దగా నీటి వనరు అవసరం లేదు. కంపలుగా పెరిగి రేఖలు మాదిరి పువ్వులు పూస్తాయి. మధ్యలో సన్నటి పుప్పొడి చాలా అందంగా ఉంటుంది. వర్షాకాలంలో పూల కాపు కాస్త మందంగా ఉంటుంది. వేసవి, శీతాకాలంలో చెట్టునిండా పువ్వులు పూస్తాయి. పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు – ముద్దనూరు రోడ్డు, పార్లపల్లి రోడ్డు – అంబకపల్లె రోడ్డు, కదిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో డివైడర్ల మధ్య ఎర్రటి, తెల్లటి కాగితాల పూలు ప్రయాణికులను కనువిందు చేస్తున్నాయి. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పులివెందుల చుట్టూ కాగితాల పూల మొక్కలను నాటడంతో అవి ఇలా పూలు పూస్తూ అందరిని ఆహ్లాదపరుస్తున్నాయి.

–పులివెందుల రూరల్

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

చక్రాయపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవా రం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీవో రాజశేఖర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌తో తాగునీటి ఎద్దడిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎర్రగుడి గ్రామంలోని బీసీ కాలనీ, గరుగుతండా, కల్లూరుపల్లె, సిద్ధవాండ్లపల్లె, మహదేవపల్లె హరిజనవాడ, గంగారపువాండ్లపల్లె పంచాయతీలో గొట్లమిట్ట, నెరుసుపల్లె గ్రామం, కొండప్పగారిపల్లెలో తక్షణం బోర్లు వేయించాలని ఆయన అధికారులకు సూచించారు.

చదువు సమాజానికి ఉపయోగపడాలి

వేంపల్లె : విద్యార్థుల చదువు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడితేనే జీవితం సార్థకమవుతుందని వేంపల్లి సీఐ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహనకార్యక్రమంనిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు, వ్యాయామం, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.